నామినేషన్ల పరిశీలన పూర్తి

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎస్.మంగమ్మ
- టిడిపి అభ్యర్థి రంగయ్య నామినేషన్ తిరస్కరణ
- పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గంకు పరిశీలన పూర్తి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల మండలి ఎన్నికల నామినేషన్ల తొలి ఘట్టం పూర్తయింది. గురువారం నాటికే నామినేషన్ల స్వీకరణ ముగిసింది. శుక్రవారం నాడు మూడు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన సాగింది. ఈనెల 27వ తేదీ వరకు ఉపసంహరణలు జరుగనున్నాయి. అవి పూర్తయిన తరువాత బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరన్నది తేలనుంది.

స్థానిక సంస్థల ఎన్నిక ఏకగ్రీవం

మండలి ఎన్నికల్లో భాంగా అనంతపురం స్థానిక సంస్థలకు సంబంధించి జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఒకటి తిరస్కరణకు గురైంది. పత్రాల్లో సంతకాలు సరిపోలకపోవడంతో రంగయ్య అనే అభ్యర్థి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. దీంతో ఒక్కటే నామినేషన్ స్వీకరణ జరిగినట్టయింది. టిడిపి మద్దతుదారుడిగా పోటీలో నిలిచిన యాడికికి చెందిన వేలూరి రంగయ్య నామినేషన్ తిరస్కరణకు గురైంది. కాగా జిల్లాలో అధికార వైసిపికి స్థానిక సంస్థల్లో పూర్తి స్థాయి బలముంది. టిడిపి నామమాత్రపు బలం ఉన్నప్పటికీ ఆ పార్టీ తరుపున రంగయ్య నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ తిరస్కరణ గురవడంతో అధికార వైసిపి తరుపున నామినేషన్ దాఖలు చేసిన మంగమ్మ విజయానికి మార్గం సుగమమైంది.

పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ నామినేషన్ల పరిశీలనా పూర్తి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి కూడా నామినేసన్ల పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టరు కేతన్ గార్గ్ నేతృత్వంలో జరిగింది. ఎన్నికల పరిశీలకులు ప్రవీణ్ ప్రకాశ్ దీనిని పరిశీలించారు. ఈ పరిశీలనల్లో పట్ట భద్రులకు సంబంధించి 63 అభ్యర్థులకుగానూ 51 నామినేషన్లు ఆమోదం పొందాయి. 12 నామినేషన్లు తిరస్క రణకు గురయ్యాయి.

నామినషన్ పత్రాలను పరిశీలిస్నున్న ఎన్నికల పరిశీలకులు, ఇన్‌ఛార్జి కలెక్టర్

స్థానం	ఆమోదం	తిరస్కరణ
పట్టభద్రులు	51	12
ఉపాధ్యాయ	14	03
స్థానికసంస్థలు	01	01

అదే విధంగా ఉపాధ్యాయ నియోజకవర్గానికిగానూ 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో మూడు నామినేషన్లు తిరస్కరణకు గురవగా 14 ఆమోదం పొందాయి. ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులందరి నామినేషన్లు ఆమోదం పొందాయి.

ఈనెల 27వ తేదీ వరకు ఉపసంహరణలు

నామినేషన్ల పరిశీలనలు పూర్తయ్యాయి. ఇక ఎన్నికలకు సంబంధించి మలి ఘట్టం ప్రారంభమైంది. పరిశీలనల్లో పూర్తయిన అభ్యర్థులెవరైన ఎన్నికల నుంచి తప్పుకోవాలంటే తప్పుకునేందుకు వీలుంది. ఉపసంహరణలు ఈనెల 27వ తేది వరకు అవకాశముంది. బరిలోనున్న వారిలో ఎవరెవరు తప్పుకుంటారన్నది అప్పటి వరకు చూడాల్సి ఉంటుంది.

ఐక్యంగా ఉద్యమిస్తే విజయం మీదే..

సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప

ప్రజాశక్తి-హిందూపురం

ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమిస్తే విజయం తప్పక వరిస్తుందని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో జ్యోతమ్మ అధ్యక్షతన ఆశావర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ పటిష్టంగా ఉండాలంటే ప్రతినెలా అందరూ సమావేశం నిర్వహించుకుని సమస్యలపై చర్చించాలన్నారు. ఇలా చేయడం వల్ల ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అందరికీ తెలుస్తాయన్నారు. అంతేగాకుండా సమస్యల పరిష్కార మార్గాలను వెతికి పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులతోపాటు ఆశావర్కర్ల యూనియన్ నాయకులు మమత, ప్రశాంతి, జేబీనమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ కార్యదర్శి నరసింహప్ప

చెరువులో పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ సమీపంలో ఉన్న శ్రీకంఠపురం చెరువులో పడి ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన శుక్రవారం హిందూపురం రూరల్ మండలం పూలకుంట వద్ద చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల మేరకు.. పూలకుంటకు చెందిన ఐటిఐ విద్యార్థి చంద్రకిరణ్ (17), బేల్దారి పని చేసే తరుణ్ (16) గురువారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లారు. ఉదయం ఇంటి నుండి వెళ్లిన యువకులు రాత్రి అయిన రాకపోవడంతో యువకుల తల్లిదండ్రులు ఆందోళనకు గురై గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం గ్రామస్తులు, యువకుల తల్లిదండ్రులు సమీప ప్రాంతాల్లో తిరుగుతూ చెరువు దగ్గర గాలించారు. అక్కడ ఓ యువకుడి చెప్పు కనిపించడంతో నీటిలో పడ్డారేమో అని అనుమానం వచ్చి నీటిలో గాలించారు. తర్వాత పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచార అందించారు. వారు వెంటనే వచ్చి ఇద్దరి యువకుల మృతదేహాలను వెలికితీశారు. ఒకరిని కాపాడబోయి మరొకరు నీటిలో మునిగి మృతిచెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం జిల్లా అసుపత్రికి తరలించారు. కాగా ఇద్దరు మృతిచెందడంతో యువకులు తల్లిదండ్రులతోపాటు గ్రామం మొత్తం విషాదంలో మునిగిపోయింది.

మృతిచెందిన చంద్రకిరణ్, తరుణ్

మహిళా సమస్యలపై పోరాటాలు

ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్

ప్రజాశక్తి-గోరంట్ల

మహిళా కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని పాలసముద్రం గ్రామంలో ఐద్వాసంఘం ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మహిళల తలరాతలు మారడం లేదన్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్లు సమాన హక్కుల కోసం ఇప్పటికీ పోరాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. 1910 మార్చి నెలలో ఒకరోజు మహిళా కార్మికుల దినోత్సవం జరపాలని ప్రపంచవ్యాప్తంగా అప్పటి మహిళా సంఘాలు తీర్మానించాయన్నారు. అప్పుడు పోరాటం చేయడం వల్ల నేడు మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ముఖ్యంగా సమాజంలో మహిళలు రాజకీయంగా, సంఘ చైతన్య పెంపొందించడానికి ఐద్వా ఎప్పటికీ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు అచ్చమ్మ, వెంకటలక్ష్మమ్మ, గంగమ్మ, నాగలక్ష్మి, గంగమ్మ, అంజలీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పంజాబ్ నేషనల్ బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బసంతకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కెపిటి వీధిలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు నూతన శాఖను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో చాలా మార్పులు, సంస్కరణలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం కస్టమర్ సర్వీసులు ఇంటివద్దకే వస్తున్నాయ న్నారు. పురాతన కాలం నాటి ఇలాంటి బ్యాంక్లను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక భద్రత ఉంటుందన్నారు. పాతకాలం నాటి బ్యాంకుల్లో వినియోగదారులకు విలువ కూడా ఉంటుందన్నారు. జాతీయ స్థాయి బ్యాంకుల్లో హెల్త్ బీమా చేసుకోవడం వల్ల సమయానికి ఆర్థికసాయం వస్తుందన్నారు. బ్యాంకు హైదరాబాద్ జోనల్ హెడ్ మహమ్మద్ మక్బూల్‌అలీ మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంకు 10,500పైగా బ్రాంచులు, 13,500 పైగా ఎటిఎంలు, రూ.20లక్షల కోట్లతో వ్యాపారంతో దేశంలోనే రెండవ అతిపెద్ద బ్యాంకుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సర్కిల్ హెడ్ కృష్ణమూర్తి, బ్యాంక్ జోనల్ హెడ్ మధుసూదన్, ఆర్డీఓ తిప్పేనాయక్, తహశీల్దార్ యుగేశ్వరీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకును ప్రారంభిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-కదిరి టౌన్

డబ్బులు కట్టలేదనే సాకుతో అమాయక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న రాఘవ ఫైనాన్స్‌తోపాటు పలు ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం పట్టణ సీఐ తమ్మిశెట్టి మధును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరిలో ఆటో, ద్విచక్ర వాహనాలకు రుణాలు ఇస్తూ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న రాఘవ ఆటో ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం రోజురోజుకీ పేట్రేగిపోతోందన్నారు. ఇందులో భాగంగా కదిరికి చెందిన జనార్దన్ అనే వ్యక్తి 2021 సంవత్సరంలో రాఘవ ఆటో ఫైనాన్స్ ద్వారా స్కూటీ వాహనాన్ని కొనుగోలు చేశాడన్నారు. అప్పటి నుంచి నెలవారి కంతులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాడు. అయితే ఈమధ్యకాలంలో ఆరోగ్యం బాగాలేక ఒక నెల కంతు ఆలస్యం కావడంతో రాఘవ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది స్కూటీని బలవంతంగా లాక్కొని వెళ్లడంతోపాటు నానాదుర్భాషలాడారన్నారు. కావున వెంటనే రాఘవ ఆటోఫైనాన్స్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం నాయకులు జగన్మోహన్, బాబ్‌జాన్, ఫైరోజ్, విజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'మా బిడ్డ మృతికి కారకులను శిక్షించాలి'

తల్లిదండ్రుల ఆవేదన

ప్రజాశక్తి-మడకశిర

ప్రేమ పేరుతో వేధించి ఆత్మహత్యకు కారకులైన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మనూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు 18 రోజుల క్రితం ప్రేమపేరుతో వేధించడంతో తమ బిడ్డ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తూ బాధితురాలి తల్లిదండ్రులు శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇటీవల ప్రేమ పేరుతో గ్రామానికి చెందిన యువకుడు వేధించడంతో తమ కుమార్తె పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందిందన్నారు. దీంతో ఈనెల 9వ తేదీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ బిడ్డకు కారణమైన నిందితుడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మనూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి-ఓబుళదేవర చెరువు

మండలంలోని సున్నపల్లి గ్రామంలో రైతులు ఉరవకొండ మాబు, హుసన్నప్ప సాగు చేసిన మొక్కజొన్న పంటను శాస్త్రవేత్తలు వేమన, నీలిమ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో ఎరువుల యాజమాన్యం తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా పంట విత్తేటప్పుడు, 30, 45, 60 రోజులకు ఒకసారి 35 కిలోల చొప్పున యూరియా వేయాలన్నారు. అలాగే 150 కిలోలు ఎస్ఎస్‌పి, 30 కిలోల ఎంఒపి దుక్కిలోనే వేయాలన్నారు. అదే పొలంలో కత్తెర పురుగులను ఆశించిన మొక్కలను పరిశీలించి ఈ మిసిటీ బెంజోటి 80 గ్రాములు ఎకరాకు వేసుకోవాలన్నారు. లేదా క్లోరిఫైరిఫాస్ 500 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేయాలన్నారు. ఈ కత్తెర పురుగు చివరి దశలో ఉన్నప్పుడు విషపు ఎరలను వాడాలని సూచించారు. తరువాత తిప్పేపల్లి గ్రామంలో రైతు బి.వెంకటరమణ నాయక్ సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ పంటలో ఆకు ఎండు తెగులును గుర్తించారు. ఆకులపై పొడవైన బూడిద రంగుతో కూడిన ఆకుపచ్చ, గోధుమ వర్ణపు మచ్చలు కనిపించాయి. వీటి నివారణ కొరకు టిల్ట్ 200 ఎంఎల్, మ్యాన్కో జబ్ 400 గ్రాములు పిచ్చికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కదిరి ఎస్.సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి ఎస్.ఇలియాజ్, మహమ్మద్, ఆర్‌బికె ఇన్‌ఛార్జిలు, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

విద్యుత్ కోతలతో ఎండుతున్న వేరుశనగ పంట

విద్యుత్ కోతలు..

ఎండుతున్న పంటలు..!

- చేతికందకుండా పోతున్న 'రబీ'
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-మడకశిర

అసలే వేసవికాలం ఆపై అప్రకటిత విద్యుత్ కోతలు వెరసి రబీ సీజన్లో బోరుబావుల కింద రైతుల సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. విద్యుత్ సరఫరా సక్రమంగా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు బోరుబావుల్లో నీరు పుష్కలంగా రావడంతో మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా రబీపంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఖరీఫ్‌లో అధిక వర్షాలు మూలంగా పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు రబీపై ఆశలో పెట్టుకున్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి వేరుశనగ, మొక్కజొన్న, రాగి, వరి తదితర పంటలను సాగు చేశారు. రబీ ప్రారంభంలో వ్యవసాయానికి 7 గంటల పాటు రెండు విడతలుగా విద్యుత్‌ను అందించేవారు. దీంతో పంటలు బాగా ఉండేవి. గత నెల రోజుల నుంచి వ్యవసాయానికి ఉన్న ఫలంగా విద్యుత్ కోతలు విధించారు. వ్యవసాయానికి ఏడు గంటల పాటు పగటి వేళల్లో విద్యుత్ అందించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మడకశిర, గుడిబండ ప్రాంతాల్లో ఇది అమలుకు నోచుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటి వేళల్లో నాలుగు గంటలు, రాత్రి వేళల్లో మూడు గంటలపాటు సరఫరా చేస్తున్నామని చెబుతున్నా గత 15 రోజుల నుంచి ఇది సక్రమంగా అమలుకావడం లేదు. వేళాపాలాలేని విద్యుత్ కోతలతో పంటలు ఎండుదశకు చేరుకుంటున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం ఓవర్‌లోడ్ వల్లనే విద్యుత్ సమస్య ఏర్పడుతోందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో పంటల సాగు విస్తీర్ణం తక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఓవర్‌లోడ్ ఎలా అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు దీనిపై స్పందించి పూర్తి స్థాయిలో పగటిపూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

కోతలు అధికం

ఇటీవల విద్యుత్ కోతలు అధికం అయ్యాయి. రబీ ప్రారంభంలో 7 గంటల పాటు పగటి విద్యుత్ సరఫరా చేశారు. గత 15 రోజులుగా మా గ్రామంలో వ్యవసాయానికి విద్యుత్ ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను విద్యుత్ అధికారుల దష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదు. పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో నష్టపోతున్నాం.

తిప్పన్న, మండలపల్లి గ్రామం, గుడిబండ మండలం.

అధిక లోడ్‌తోనే సమస్య

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ అందిస్తున్నాం. కొన్నిచోట్ల గతంలో ఉన్న విద్యుత్ బోర్ల కంటే అధికంగా రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. దీనివల్ల ఓవర్‌లోడ్ అయ్యి కొన్ని ప్రాంతాలకు విద్యుత్‌సరఫరా నిలిచిపోతోంది. ఓవర్ లోడ్ ఉన్న గ్రామాలను గుర్తించి ఈ సమస్య పరిష్కారానికి అదనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటుచేస్తాం. లోవోల్టేజ్ సమస్య పరిష్కరించి వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.

సుబ్రమణ్యప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీ.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమాజ అభివద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నాడు ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి సేవాదళ్ జాతీయ మహిళాల సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సురేపల్లి నంద పాల్గొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 2500 మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ ఇంకా వివక్ష కొనసాగుతోందన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాలలో సైతం మహిళలు ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే మహిళలు అభివద్ధి సాధించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

కదిరి ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి హుండీల లెక్కింపును ఆలయ అధికారులు శుక్రవారం చేపట్టారు. ఇందులో 72 రోజులకు భక్తుల ద్వారా రూ.98,13,595 నగదు వచ్చినట్లు ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి పట్టం గురు ప్రసాద్, చైర్మన్ గోపాలకష్ణ తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వణ అధికాకారితో పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి నరసింహరాజు ఎస్‌బిఐ బ్యాంకు, మేనేజర్ ఫణికుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతుల్లేవు..

ఇన్‌ఛార్జి డీఎస్పీ యశ్వంత్, కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రధాన రహదారి కూడల్లో నూతన విగ్రహాల ఏర్పాటుకు ఇక నుంచి అనుమతులు లేవని కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల కాలంలో అనుమతులు లేకుండా విగ్రహాల ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వాటిని అడ్డుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తే ఆందోళనలు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఇకపై పురపాలక సంఘ వ్యాప్తంగా ప్రధాన రహదారుల్లో ఎలాంటి విగ్రహాలు ఏర్పాటు చేయడానికి అనుమతులు లేవన్నారు. నిబంధనలను అతిక్రమించి విగ్రహాలు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తే చర్యలు తీసుకోవడం తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సౌజన్య, వన్‌టౌన్, టూటౌన్ స్టేషన్ సిఐలు ఈరన్న, వెంకటేశ్వర్లు, పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక అధికారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డీఎస్పీ యశ్వంత్

విధుల్లో అలసత్వం వద్దు

లేపాక్షి : వైద్యసిబ్బంది విధులో అలసత్వం ప్రదర్శించకూడదని జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా వారి పట్ల మర్యాదగా మాట్లాడి చికిత్స చేయాలన్నారు. అత్యవసరమైతే మాత్రమే మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తరలించాలని సూచించారు. ముఖ్యంగా విధుల్లో ఉన్న వారు క్వార్టర్స్‌లో ఉండకూడదన్నారు. ప్రతి శనివారం ఎంపిఎచ్ఒలు విధిగా హాజరు కావాలన్నారు. విధులల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుత గది, గర్భిణులకు అందిస్తున్న మందులు, రక్తహీనత ఉన్న మహిళలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం కొండూరు సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ కొండారెడ్డి, స్థానిక వైద్యాధికారి వెంకట చిరంజీవి, సిబ్బంది హుస్సేన్‌బీ, ప్రసాద్ పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

బుక్కపట్నం : ఎండాకాలం తీవ్రత కానున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ ఎండాకాలంలో విద్యార్థులు అనవసరంగా బయట తిరగకూడదన్నారు. అలాగే రోజూ తప్పనిసరిగా 5 లీటర్ల నీరు తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాంతి, మురళీగౌడ్, రామాంజినమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల : మండలంలోని జీనవాండ్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో సీతారామచంద్ర ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరనారాయణ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఆలయాలు, ప్రార్థనా మందిరాలు నిర్మించుకోవడానికి స్థలాలు కేటాయించడం ఎంతో సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ప్రభాకర్‌రావు, ఉపసర్పంచు శ్రీనివాసులు, నాగే నాయక్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జయచంద్రారెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన యువజన నాయకులు

హిందూపురం : నూతనంగా ఎంపికైన వైసిపి యువజన జిల్లా అధ్యక్షులు వాల్మీకి లోకేష్ శుక్రవారం జిల్లావ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు, నాయకులను కలిశారు. తొలత జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మాలాగుండ్ల శంకరనారాయణను కలిశారు. అనంతరం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెనపూస రవీంద్ర రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ కుమార్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మీడియా కో-ఆర్డినేటర్ ప్రణయ్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మనోజ్ కుమార్‌గౌడ్, కుళ్లాయిప్ప, అశోక్, వంశీ, నితీష్, షేక్షావలి, మధు తదితరులు పాల్గొన్నారు.

In the Court of the VIth Addl. District Judge: Gooty

I.A.No.1331/2022 in O.S.No.03/2019

Between:

Ranga Srinivasulu ...Petitioner/Plaintiff

And

Sri Nakshatra Builders Development India Private Ltd., Hindupur. ...Respondant/Defendant

Notice to Respondant

To,
Sri Nakshatra Builders and Developers India Private Ltd., by its Manager B.Ramesh Reddy, S/o Late Venkata Subba Reddy, R/at Haripriya Complex, Thrinethra Super Market Building, Cocoon Market Road, Hindupur.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం 01-03-2023వ తేదిన ఉ॥10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎం.వి. మహేష్ కుమార్, అడ్వకేటు గుత్తి.

In the Court of the Senior Civil Judge: Hindupur

I.A.No.13/2021 I.A.143/2022 IN O.S.No.92/2014

Between:

1.R.Siva Reddy (Died) by his Lrs Plaintiffs No-3 and 4
2.R.Bhaskar Reddy
3.Smt.R.Sarojamma
4.R.Bayapa Reddy

...Petitioners/Plaintiffs

And

1.Gangulamma and others

...Respondents/Defendants

Notice to Respondent No:14,16 and 17

1. Sankar Reddy, S/o Late Narayana Reddy, aged about 56 years, agriculturist, (R14)
2. Raja Gopal Reddy, S/o Late Narayana Reddy, Aged about 52 years, agriculturist, (R16), both are R/o. Palagala Palli Village, Chilamathur Mandalam.
3. Smt. Sujathamma, D/o Late Narayana Reddy, W/o Suryanarayana Reddy, aged about 50 years, House wife, R/o. Madhugire Palli, Chilamathur Mandal. (R17).

The Plaintiffs filed the above suit for partition of the suit schedule properties against you respondents No.14,16, and 17 and others on the file of Senior Civil Judge court Hindupur and also filed I.A.13/2021 to set aside the abetment and I.A.143/2022 for adding of parties the same is posted to 10-03-2023 for your appearance in person or through an advocate. If you failed to appear on that day, you will be set ex-parte and the matter will be decided in your absence.

(By the Order of Court)

C.RAMACHANDRA REDDY
Advocate for Plaintiffs
Hindupur.

గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి..

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

సిఎం జగన్ అమల చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సైనికుల్లా పనిచేయాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎంపికైన గృహసారథులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం గర్వపడేవిధంగా ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' అన్న నినాదంతో ముందుకు సాగుతూ జగనన్న ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. 2024లో గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా పని చేయాలన్నారు. ముఖ్యంగా మీరు చేయాల్సింది నాడు చంద్రబాబు పాలనకు, జగన్ సంక్షేమ పాలనకు తేడాను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో సామాజిక విప్లవం నడుస్తోందన్నారు. జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర కులాల వారికి పెద్దపీట వేస్తూ సమన్యాయం చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో రూ.2లక్షల కోట్లకుపైగా నగదును ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు రోషన్ అలి, మల్లికార్జున, అయూబ్, నాసీర, చిన్నమ్మ, రహమత్ బి, నాయకులు వెంకటేష్ రెడ్డి, ఇలియాజ్, ఇతర కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలతో పాటు గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : సబ్ కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-అమరాపురం

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని సబ్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని హలుకూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అంకితభావంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ మార్గాన్ని తూచా తప్పకుండా కచ్చితంగా అమలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, విఆర్ఓ శివకుమార్, రవికుమార్, మండల సర్వేయర్ దినేష్, సచివాలయ సిబ్బంది రంగనాథ్, శివలింగప్ప, శృతి, సింధూర, సర్పంచ్ శివలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాలను పరిరక్షించాలి

చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని వానవోలు సమీపంలో ఉన్న విజయనగర సామ్రాజ్య కాలం నాటి రెండు ఆలయాలను పునర్ నిర్మించాలని రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులకు చారిత్రక పరిశోధకుడు మైనా స్వామి విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఆయా ఆలయాలను సందర్శించిన మైనా స్వామి అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మాధవరాయ గుడిగా పిలుస్తున్న వైష్ణవ ఆలయంతోపాటు మరో ప్రాచీన శివాలయాలను రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులను సందర్శించి రక్షిత కట్టడంగా ప్రకటించి వాటిని పునర్ నిర్మించాలని కోరారు. ఆలయాల ఆలనా పాలన చూసేవారు లేనందున కొందరు ధన దురాశపరులు గుప్తనిధుల కోసం తవ్వేయడమే కాకుండా కూలిపోయేంతగా ధ్వంసం చేశారన్నారు. వైష్ణవ శివాలయాల కట్టడాల తీరును బట్టి అవి విజయనగర సామ్రాజ్య చక్రవర్తి అచ్యుత దేవరాయల కాలంలో నిర్మించి ఉండవచ్చని తెలిపారు. అయితే ఆలయాలకు తూర్పున ఒక పెద్ద బండపై ఉన్న తెలుగు శాసనం ప్రకారం క్రీస్తుశకం 1638లో రెండవ వెంకటపతి దేవరాయలు ఈ ఆలయాలకు మాన్యాన్ని ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు బహుధాన్య సంవత్సరం శ్రీమద్రాజాదిరాజ రాజా పరమేశ్వర వీర ప్రతాప శ్రీ వెంకటపతి దేవ రాయా మహారాయలు అని శాసనం మొదలవుతోందన్నారు. మల్లెల భాస్కర అచ్యుత అయ్యి కుటుంబానికి బయనకుంటపల్లి, మల్లెల, ఆదిం శెట్టిపల్లి, తదితర గ్రామాల పరిధిలోని భూములను దానంగా ఇచ్చినట్లు శాసనం స్పష్టం చేస్తోందన్నారు. రెండు ఆలయాల్లో నిత్యం ధూప దీప నైవేద్యాలు సమర్పించాలని రాజు ఆదేశానుసారం భూములను దానంగా ఇచ్చారన్నారు. శాసనంలో వానవోలు, మల్లెల, బయనకుంటపల్లి, ఆదిం శెట్టిపల్లి తదితర గ్రామాల పేర్లు చాలా స్పష్టంగా ఉన్నాయి. అయితే ఆ భూములన్నీ కూడా ఎవరి ఆధీనంలో ఉన్నాయో ప్రస్తుతం తెలియడం లేదన్నారు. నాటి రాజులు ఆలయాలకు సమర్పించిన భూములపై దేవాదాయ శాఖ సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది సూచించారు. శుక్రవారం స్థానిక ప్రశాంతిగ్రామ్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కుళ్లాయప్పనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలన్నారు. ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యామాం చేయాలని సూచించారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించి జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైడేలో భాగంగా పరిసరాల పరిశుభ్రత గురించి ఆరా తీసి అపరిశుభ్రత ప్రాంతాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, ఎఎంఒ లక్ష్మీనాయక్, ఎస్‌యుఒ రమణయ్య, ఇపిడమిక్ అధికారి వెంకటరమణ, సూపర్ వైజర్లు గోపి, రమణ, త్రిలోక్, ఆరోగ్య శానిటేషన్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త అమృత, ఆశా కార్యకర్తలు అనిత, సరోజాబాయి, వాలంటీర్లు కల్యాణి, సాలిబాయి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సరస్వతి పూజ

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల పరిధిలోని టేకులోడు గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం సరస్వతి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కరుణ జ్యోతి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థినులు ఎలాంటి అవరోధాలు లేకుండా పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొందాం

టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-తలుపుల

తలుపులలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్

టిడిపి కార్యకర్తలు వైసిపి చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక సొసైటీ వెనక మైదానంలో టిడిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కావున కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. టిడిపి కార్యకర్తలు క్రమశిక్షణతో ఉంటారని, అలాంటి వారి జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పర్వీన్‌భాను, మనోహర్‌నాయుడు, ముబారక్, జయచంద్ర, అక్బర్, మౌలాలి, చిన్నపరెడ్డి, అమర్నాథ్, సిద్దేశ, వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కార్యకర్తలు సైనికుల్లా పని చేసి చంద్రబాబును సిఎం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రం సమీపంలో ఉన్న ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి ఒక తాటిపైకి వచ్చి విజయం కోసం శ్రమించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను ఎదుర్కొంటూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంగరాజు, మాజీ సర్పంచ్ ప్రసాద్, న్యాయవాది నాగేంద్రప్రసాద్, మాజీ మహిళా అధ్యక్షురాలు పర్వీన్‌భాను, ఎంపిటిసి జయరామకృష్ణారెడ్డి, సర్పంచులు శివప్పనాయుడు, అనసూయమ్మ, ఎస్సీ సెల్ గంగాధర్, ఆంజనేయప్పనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఓటును అభ్యర్థిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేషన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు ప్రయివేటు పాఠశాలలు నిరుద్యోగులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, రామచంద్ర ఎస్ఎఫ్ఐ నాయకులు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాదులూరు పోతులయ్యస్వామి జాతర
పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-కనగానపల్లి

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి

మండలంలోని దాదులూరులో వెలసిన పోతులయ్య స్వామి జాతర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనగానపల్లి వైస్ ఎంపిపి నరసింహారెడ్డి, దాదులూరు సర్పంచి మురళి, ఎస్.హనుమంతురెడ్డి, కర్ణాటక, తెలంగాణ వ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నేరుగా ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై ఇంటి వద్ద ఉన్న విద్యార్థులు ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈనెల 27వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సత్యకృప డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ

ప్రతిభ కనబరచిన సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ధర్మవరం టౌన్ : అనంతపురం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో రెండురోజుల క్రితం జిల్లాస్థాయి క్విజ్, ఆర్ట్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు సత్యకృప మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి తెలిపారు. దీంతో శుక్రవారం కళాశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులను కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి, ప్రిన్సిపల్ మల్లికార్జున, అధ్యాపకులు అభినందించారు. కళాశాల విద్యార్థినులు పవిత్ర, భారతి, జ్యోతిక, మౌనిక, వైష్ణవి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రెండవస్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం : ఎమ్మెల్యే

తలుపుల : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసి వైసిపి అభ్యర్థి వెన్నపూస విశ్వనాథ్‌రెడ్డిని గెలిపించుకుందామని ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తలుపుల 1, 2, 3వ సచివాలయ పరిధిలోని ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. కావున ఓటర్లతో మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి గెలిపించాలని కోరారు.

కరాటే బెల్ట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : షోటోఖాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ పోటీల్లో జైను స్కూల్ విద్యార్థులు అర్హత సాధించినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయగుప్త మాట్లాడుతూ కరాటేతో విద్యార్థులకు ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం, ఆత్మధైర్యం, శారీరక దృఢత్వం, మానసికోల్లాసం, మేథోశక్తిని ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాబోయే కాలంలో కరాటే స్పోర్ట్ కోటాలో మరెన్నో అవకాశాలు లభిస్తాయన్నారు. కలర్ బెల్ట్‌లో 54 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వీరిలో 30 మంది ఎల్లో బెల్ట్, 10 మంది ఆరెంజ్, ఏడుగురు గ్రీన్ బెల్ట్, నలుగురు బ్లూ బెల్ట్, ముగ్గురు పర్పుల్ బెల్ట్‌లు సాధించినట్లు తెలిపారు. అనంతరం బెల్ట్‌లు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కరాటే మాస్టర్ షాకిర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జైన్ స్కూల్ ఛీఫ్ ఆపరేషన్ సాగర్, పాఠశాల ఇన్‌ఛార్జి ఉమమహేశ్వర, జాఫర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం..

ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీధర్‌రెడ్డి

బుక్కపట్నం : ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గసిగవారిపల్లి గ్రామ పంచాయతీలో లబ్ధిదారులకు మంజూరైన జగనన్న ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అర్హులందరికీ ఇంటి పట్టాలతోపాటు ఇంటి నిర్మాణాలు చేసి ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, సర్పంచి గోవిందరెడ్డి, హౌసింగ్ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఆర్‌జెసిలో అధికారుల విచారణ హర్షణీయం

పరిగి : ఎపి ఆర్‌జెసి కళాశాలలో కులం పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టడం హర్షణీయమని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎంఎస్ఎఫ్ నాయకుడు రవికుమార్, దళిత సమైక్య జిల్లా అధ్యక్షుడు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీరలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వహించిన వారు మాట్లాడుతూ విచారణ చేపట్టిన మండల అధికారులు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణ కులాలకు చెందిన సుజాత, శివారెడ్డి, చెన్నకేశవులుపై కేసులో నమోదు చేసే విధంగా చొరవ తీసుకుని కళాశాలలో ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తాం

కొత్తచెరువు : కొత్తచెరువులోని నూతనంగా ఏర్పడిన వేణుగోపాల్ కాలనీలో ఏర్పడిన డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపిడిఒ సిద్ధారెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం సాయంకాలం అధికారులు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రెయినేజ్ సదుపాయం లేక మురికినీరు రోడ్లపై ఇళ్ల ముందర నిల్వ ఉంటోందన్నారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్, సచివాలయ కార్యదర్శులు విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కదిరిలో అగ్నిప్రమాదం

కదిరి : పట్టణంలోని టవర్ క్లాక్ దగ్గర ఉన్న కడప స్వీట్ షాప్ పక్కన ఉండే మొబైల్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆసమయంలో అపోలో ఫార్మసీలో మందులు తీసుకోవడానికి వచ్చిన కొందరు దట్టమైన పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అంతలోనే 31వ వార్డుకు చెందిన యువకులు వచ్చి తాళాలు పగులగొట్టి చూసేలోపు ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపు చేసింది. అంతలోనే దుకాణం పూర్తిగా కాలి బూడిదైంది.

ద్విచక్ర వాహనం.. కంటైనర్ ఢీ..ఇద్దరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న బాబులాల్ డాబా ముందు ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన తెలిపిన వివరాల మేరకు.. యర్రంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 ద్వారా అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా జాతీయ రహదారిపై రోడ్డు పనులు జరుగుతుండడంతో వాహనాలను ఒక్కవైపునకు మళ్లించారు. ఇందులో భాగంగానే కంటైనర్ మలుపు తిరిగే సమయంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీకొందని తెలిపారు.

సిఐకి అభినందనలు

పుట్టపర్తి రూరల్ : భోపాల్‌లో జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం రూరల్ సీఐ మన్సూరుద్దీన్‌ను అదనపు ఎస్పీ రామకృష్ణప్రసాద్ అభినందించారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో సిఐకి ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో కనబరిచిన సిఐ సేవలు ఎనలేనివన్నారు. ప్రతి పోలీస్ విధుల్లో నిబద్ధతతో ఉండాలని కోరారు.

ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునికి అభినందనలు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్యసాయి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్‌ను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అభినందించారు. నియోజకవర్గ అనుబంధ విభాగంలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మొదటిసారి ఎమ్మెల్యేని కలిశారు. ఇందులో భాగంగా పెడపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తిరుపాల్‌నాయక్, మోహన్ నాయక్, శ్రీనివాస్ నాయక్, బాపూజీ నాయక్, రవీంద్ర నాయక్, బాబు, తిరుపాల్‌నాయక్ కలిసి ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గిరిజనుల సమస్యలు పరిష్కరించడంలో ప్రముఖ పాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెడపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసిపి గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

25 నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు

గుడిబండ : ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు మండల పరిధిలోని హిరేతూర్పి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఉట్ల జాతర బ్రహ్మ రథోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పారిశ్రామికవేత్త జియో మెట్రిక్, సిఎస్‌సి సిస్టం, సాయిరాం, సి.ఎస్.సి యూనిట్ ఎండి హెచ్.గొల్లహట్టి కసాపురం ఎస్.చిత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న శనివారం ఉదయం 8 గంటలకు శ్రీరామ తారక హోం, సీతారామచంద్ర కల్యాణోత్సవం, జ్యోతి ఉత్సవాలు, మహా మంగళహారతులు, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న మధ్యాహ్నం ఆంజనేయ స్వామి బ్రహ్మరథోత్సవాలు, 27న సాయంత్రం ఉట్లపురుష, జాతర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున హిరేతుర్పి గ్రామస్తులే కాకుండా హెచ్.గొల్ల హట్టి, కరికెర, దాసరపల్లి, కుంబర నాగేపల్లి, చిగతుర్పి, సింగేపల్లి తదితర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

బత్తలపల్లి : మండలంలోని రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు, ఎరువులు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని డి.చెర్లోపల్లి రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూములను భూసార పరీక్షలు చేయించడం ద్వారా పొలాల్లో ఏయే పోషకాలు, లోపాలున్నాయో తెలుసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వేసుకువంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. అలాగే వేరుశనగ సాగు చేసిన రైతులు మార్కెట్‌లో తక్కువ ధరకు ప్రయివేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోకుండా ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు అమ్ముకోవాలన్నారు. అదేవిధంగా ఈ-క్రాప్ నమోదును తనిఖీ చేశారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులందరూ తమ పంటను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వీరాంజనేయులు. గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఇస్తిమా ఏర్పాట్లు పరిశీలన

కదిరి టౌన్ : కదిరి రూరల్, కుమ్మరవాండ్లపల్లిలో వచ్చేనెలా 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ఇస్తిమా ఏర్పాట్లను వైసిపి సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్తిమాకు తనవంతు సహాయ సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు బహుద్దీన్, ముస్లిం మతపెద్దలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి లలితా మిత్రబృందం చేయూత

పరిగి : ఇటీవలే వేడి నీటిలో పడి గాయపడిన విద్యార్థిని కుటుంబానికి లలితామిత్ర బృందం చేయూతనందించింది. పెనుగొండ మండలం కురుమపల్లి గ్రామానికి చెందిన నాలుగేళ్ల వెన్నెల అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి ఆడుకుంటుండగా ఉడికించిన కోడిగుడ్ల నీటిలో పడిన విషయం తెలిసిందే. దీంతో హిందూపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న పరిగి ఇందిరమ్మ కాలనీకి చెందిన లలితా తన మిత్రబృందం ద్వారా సేకరించిన రూ.10వేల మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి చిన్నారిని పరామర్శించారు.

రాష్ట్రంలో శాడిస్టు పాలన : మాజీమంత్రి పల్లె

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో శాడిస్టు పాలన సాగుతోందని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. ముఖ్యంగా టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. జగన్ ఎన్నికల సమయంలో చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అలాగే త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్, ఎల్‌ఐసి నర్సింహులు, జిల్లా నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, బొమ్మయ్య, మాజీ సర్పంచ్ శ్రీరామ్ నాయక్, సుధాకర్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు అంబులెన్స్ రమేష్, టిడిపి అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

డీజిల్ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి జిల్లాకు సంబంధించి ఆరు ఆర్టీసీ డిపోలకు డీజిల్ సరఫరాకు డీలర్ల నుంచి టెండర్లను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ కార్యాలయంలో కమిటీ టెండర్లను పరిశీలించారు. 35 టెండర్లు వేయగా ఒక టెండర్‌ను దరఖాస్తుదారుడు ఖాళీగా కోట్ వేసినందున అధికారులు తిరస్కరించారు. మిగతా 34 టెండర్ల దరఖాస్తులను పరిశీలించి, త్వరలో అర్హత కలిగిన టెండరు ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే కొన్ని టెండర్ల దరఖాస్తుదారులతో అధికారులు కుమ్మక్కై తక్కువ టెండర్‌దారులకు అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని కొందరు టెండర్ దరఖాస్తుదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అలాంటిదేమీ లేదని తాము టెండర్లు పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిస్తామని ఎలాంటి కుట్రలు చేయాల్సిన అవసరం తమకు లేదని కమిటీ అధికారులు ప్రకటించారు.